క్లుప్తంగా

నేడు చింతనలంకలో వేంకటేశ్వరుని కల్యాణం

అయినవిల్లి: చింతనలంకలో వేంచేసిఉన్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం నుంచి స్వామికి ఆలయ అర్చకులు సుదర్శనం శోభనాద్రిచార్యుల ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం ఊరేగింపు ఉత్సవం, సాయంత్రం ఏడు గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్వామిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారన్నారు. శుక్రవారం గ్రామోత్సవం జరిపారు. స్వామిని గ్రామంలో ఊరేగించారు. అలాగే నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన కాదంబరి మల్లికార్జున్, సత్యభావన దంపతులు శుక్రవారం రూ.10,016 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు గొడవర్తి శ్రీనివాస్ స్వామి వారి ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఉద్యోగులు సత్యమూర్తి, రమేష్, శ్రీనివాస్ దాత కుటుంబానికి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు దాతను అభినందించారు.

రావులమ్మ ఆలయంలో ఏకాహం



రావులమ్మ వారు

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి ఆలయంలో ఏకాహాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏటా అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏకాహం జరుపుతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రావులమ్మ అమ్మవారిని గ్రామ ఆడపడుచులు, భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సాగునీరందక ఎండుతున్న వరిచేలు



వెలువపల్లిలో సాగునీరు లేక ఎండుతున్న వరిచేలు



నేదునూరు పెదపేట చర్చి వద్ద ఎండుతున్న వరిచేలు

అయినవిల్లి: నాట్లు వేసి పదిహేను రోజులు కూడా కాలేదు. అప్పుడే సాగునీటికి ఎద్దడి. మండలంలో వెలువలపల్లి, చింతనలంక, నేదునూరు గ్రామాల్లో ఇదీ పరిస్థితి. ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసినా వారు పత్తాలేరని రైతులు వాపోతున్నారు. ఇక కొత్తగా ఎన్నికైన నీటి సంఘాల ప్రతినిధులకు అంతంత మాత్రంగానే అవగాహన. దీంతో రైతులు సాగునీటి కోసం లబోదిబో మంటున్నారు. ఇంక మరి పంట ఆఖరి వరకూ సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓ పక్కన ఇరిగేషన్ అధికారులకు, మరో పక్కన సాగునీటి సంఘాల ప్రతినిధులకు రైతులు తమగోడు వెళ్లబుచ్చుకుంటున్నారు. సాగునీరు సరఫరా చేయమని వారు తమకు ఇంకా నిధుల్లేవని ఉన్న సాగునీటినే సరిపెట్టుకోవాలని రైతులకు చెబుతున్నారు. మరి ఇక వరి సాగు ఎలా సాగేనో ఆ దేవునికే ఏరుక.

కుంభమేళాలో గరగ ప్రదర్శనలు



కుంభమేళాలో పాల్గొని గరగ నృత్య ప్రదర్శన ఇస్తున్న నాగబాబు బృందం

అంబాజీపేట: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో ఏర్పాటు చేసిన కళావేదికపై ముక్కామలకు చెందిన విజయదుర్గ సంగీతం, నృత్య కళాక్షేత్రం నిర్వాహకులు పసుపులేటి నాగబాబు ఆధ్వర్యంలో గరగ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. సౌత్ జోన్ కల్చర్ సెంటర్ నుంచి జనవరి 21న ఆహ్వానం అందిందని నాగబాబు తెలిపారు. ఈ నెల 2న కుంభమేళాకు 15 మంది సభ్యులు తరలి వెళ్లామన్నారు. 6,7 తేదీల్లో గరగ నృత్య ప్రదర్శనలు ఇచ్చామన్నారు. అలాగే శనివారం కూడా నృత్య ప్రదర్శన ఇస్తున్నామన్నారు. మూడు రోజులు పాటు ఇచ్చిన గరగ నృత్య ప్రదర్శనకు మంచి ఆదరణ లభించిందన్నారు. కుంభమేళాకు వచ్చిన ప్రముఖులు ముగ్దులవ్వడంతో పాటు ప్రశంసించారని నాగబాబు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రదర్శించిన పర్యావరణ హితమైన ఏటికొప్పాక బొమ్మల శకటానికి ఇరువైపులా నాగబాబు బృందం సంప్రదాయ గరగనాట్యం చేస్తూ పాల్గొన్న విషయం తెలిసిందే.

పొట్టిలంకలో నేడు 'కార్యకర్తలతో కాసేపు'



గన్నవరపు శ్రీనివాసరావు

అయినవిల్లి: మండలంలోని పొట్టిలంక గ్రామంలో ఈశాన్యం సెంట్‌మెంట్‌గా నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో శనివారం 'కార్యకర్తలతో కాసేపు' కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు శుక్రవారం నాడొక ప్రకటనలో తెలిపారు. తొలుత అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ఎనిమిది గంటలకు పూజలు చేస్తామన్నారు. అనంతరం అయినవిల్లిలో అల్పాహారం తీసుకుని పొట్టిలంక గ్రామం చేరుకుంటామన్నారు. అక్కడ కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో కొంతసేపు సమావేశమై పార్టీ విధి విధానాలపై మాట్లాడతామన్నారు. పార్టీ ఉన్నతి కోసం చర్చిస్తామన్నారు. అక్కడ నుంచి క్రాప, శంకరాయగూడెం చేరుకుని అక్కడ భోజనం అనంతరం ముగుస్తుందని శ్రీనివాసరావు తెలిపారు. నియోజక వర్గ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



కంటి, దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రభాకర్

మామిడికుదురు: పాశర్లపూడిలంక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఈఎన్‌టీ, డెంటల్ పరీక్షలు నిర్వహించారు. శ్రీసత్యసాయి బాబా జయంతి పురస్కరించుకుని ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు అడబాల కొండబాబు తెలిపారు. దీనిలో భాగంగా 25వ క్యాంపు పాశర్లపూడిలంకలో ఏర్పాటు చేశామన్నారు. సత్యసాయి సేవా సంస్థల అమలాపురం జోనల్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పలువురు సేవా సంస్థల ప్రతినిధులు ఈ శిబిరంలో సేవలందించారు.

పలువురికి 'వసుధ' ఆర్థిక సాయం



మలికిపురంలో లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న బుజ్జిరాజు

మలికిపురం: సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు సమకూర్చిన ఆర్థిక సాయాలను శుక్రవారం లబ్ధిదారులకు అందించారు. మలికిపురంలోని వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన కార్యక్రమంలో చెక్‌ల రూపేణా బాధితులకు అందించారు. ఎ.నరసింహరాజు(అంతర్వేది పాలెం)కు రూ.పది వేలు, బత్తుల సుజాత (శంకరగుప్తం)కు రూ.పది వేలు, పోతుల పుల్లారావు(రామరాజులంక)కు రూ.7 వేలు, ఎ.వెంకట సంధ్య (మోరి)కు రూ.5 వేలు, శెట్టిం ముసలయ్య (శంకరగుప్తం) రూ.5 వేలు, మొత్తం రూ.37 వేలను సాయంగా అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజుతో పాటు, శంకరగుప్తం సర్పంచ్ రాపాక ఆనందకుమార్, అటారం మాస్టారు, గిడుగు తాతాలు పాల్గొన్నారు. సాయం అందించిన వెంకట రామరాజుకు బాధిత కుటుంబాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

సుబ్రహ్మణ్యశర్మకు సన్మానం



సుబ్రహ్మణ్యంను సత్కరిస్తున్న స్థానికులు, నాయకులు

అంబాజీపేట: ఇటీవల రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ అర్చకుడిగా అవార్డు అందుకున్న నందంపూడి శివాలయ ప్రధాన అర్చకుడు యలమంచలి సుబ్రహ్మణ్యశర్మను స్థానికులు, నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ఆలయంలో సుబ్రహ్మణ్యంను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి ఆశీర్వాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో పితాని వీరాస్వామి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కుడుపూడి బుజ్జి, గణపతి వీరరాఘవులు, మైపాల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన సిరిపల్లిలో మెగా వైద్య శిబిరం

అయినవిల్లి: సిరిపల్లి ఇందిరా కాలనీ వద్ద శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ సెక్రటరీ మద్దెల వెంకటేశ్వరరావు ఇంటి వద్ద కిమ్స్ వైద్యుల పర్యవేక్షణలో ఉచిత వైద్య సేవలు అందించారు. అవసరమైన రోగులకు ఈసీజీ, బీపీ, బ్లడ్ సుగర్, నేత్ర పరీక్షలు నిర్వహిచారు. సుమారు వందమందికి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఐదుగురికి కంటి శస్త్ర చికిత్సకు సిఫారసు చేశారు. 35 మందికి ఉచితంగా లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో అమలాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ రవణం వేణుగోపాల్, ఐ విజన్ ట్రెజరర్ లయన్ జంపన సుమన్ వర్మ, జోన్ చైర్‌పర్సన్ లయన్ గోకవరపు మల్లికార్జున స్వామి, లయన్ గుత్తుల నాగేశ్వరరావు, లయన్ చిక్కాల సతీష్, లయన్ పట్నాల వెంకటరమణ, ఇతర లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య చర్యలు



పెదపళ్లలో డ్రైడే నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిషోర్ అన్నారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమి, కీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

వీఆర్వోలకు డీడీఓగా తహసీల్దార్ ఉండాలి

అయినవిల్లి: వీఆర్వోలను గ్రేడ్-1, గ్రేడ్-2గా విభజించి వ్యత్యాసాలు చూడకూడదని అందరికీ కామన్ డీడీఓగా తహసీల్దార్ ఉండాలని వీఆర్వోలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి మండలంలోని 21 గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్వోలు చేరి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు మెమొరాండం అందజేశారు. అయినవిల్లి మండల వీఆర్వో సంఘ అధ్యక్షుడు ఈవీవీ సత్యనారాయణ, కార్యదర్శి ఎన్.నాగరాజు తదితరులు ఉన్నారు.

రైతు ఖాతాల్లో పీఎం కిసాన్ సొమ్ము జమ

అయినవిల్లి: రైతుల ఖాతాల్లో 19వ విడత పీఎం కిసాన్ పథకం సొమ్ములు రూ.6 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని ఇందుకు రైతులు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ, ఆధార్ లింకై ఉండాలని, అలాగే ఈ-కేవైసీ చేసి ఉండాలని మండల వ్యవసాయ అధికారి వై.శోభ తెలిపారు. మండలలో ఈ-కేవైసీ లింక్ కాని రైతులు 530 మంది ఉన్నారన్నారు. అలాగే ఆధార్ లింక్ కాని రైతులు 119 మంది ఉన్నారన్నారన్నారు. ఈ రైతుల లిస్ట్ రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఓసారి రైతు సేవా కేంద్రాల్లో రైతులు తమ పేరు చెక్ చేసుకుని, ఆ లిస్టులో పేరు ఉంటే దగ్గరలో ఉన్న సీసీఎస్ సెంటర్‌కు వెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే దగ్గరలో ఉన్న గ్రామ వ్యవసాయ శాఖ, ఉద్యానవన సహాయకులను సంప్రదించాలన్నారు.

సర్వేయర్ అదృశ్యంపై కేసు

అయినవిల్లి: అయినవిల్లి సచివాలయం-2 సర్వేయర్ దంగేటి మణికంఠ(29) అదృశ్యంపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు అయినవిల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వాడపల్లి శ్రీనివాసరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి సచివాలయం-2 సర్వేయర్ దంగేటి మణికంఠ ఓ ఏడాదిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన స్వగ్రామం ముమ్మిడివరం మండలం ఠాణేలంక బాడవ, ఈ నెల 4న తన ఇంటి నుంచి సచివాలయం విధులు నిర్వహించేందుకు వచ్చాడు. తిరిగి ఇంటికి రాలేదని బంధువుల ఇంటి వద్ద, సచివాలయం వద్ద ఆచూకీ తీసినట్లు మణికంఠ తండ్రి సత్యనారాయణ తెలిపాడు. అతనిచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో బీమా నమోదు



బీమా కార్డు అందిస్తున్న లేబర్ ఆఫీసర్ మల్లేశ్వరరావు

మలికిపురం: మండలంలోని లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజోలు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కాశి శివ నాగమల్లేశ్వరరావు సమక్షంలో ఈ-శ్రమ్ పోర్టల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కార్మిక శాఖ ఏర్పాటు చేసింది. నమోదు అర్హతకు 16 నుంచి 60 ఏళ్ల లోపు వారంతా అర్హులు. అకౌంట్ పాస్ బుక్ లేనివారు, ఇన్‌కంటాక్స్ కట్టని వారు ఈ పరిధిలోకి వస్తారని ఆఫీసర్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. నమోదు చేయుటకు ఆధార్ కార్డ్, బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకం, ఆధార్‌కు లింక్ అయిన సెల్ నంబర్ తీసుకువెళ్తే మీ-సేవకు వెళ్లినా నమోదు చేస్తారని ఆయన అన్నారు. ఈ కార్డు పొందిన వ్యక్తులు రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా వర్తిస్తుందని ఆయన అన్నారు. మొదటి కార్డు గునిశెట్టి ప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాల కృష్ణరాజు, పలచోళ్ళ నారాయణరావు, ఆచంట ప్రసాద్ పాల్గొన్నారు.

తాచుపాము హల్‌చల్

అంబాజీపేట: స్థానిక పెద్దవీధి శివారు శ్యామలాంబ గుడి సమీపాన తాచుపాము హల్‌చల్ చేయడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దొమ్మేటి సత్యవతి వంట గదిలో తాచుపాము హల్‌చల్ చేయడంతో ఆమె కుటుంబ సభ్యులు భయాందోళనకు గురై భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. దాంతో వర్మ తాచుపామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించారు. జన సంచారం లేని ప్రాంతంలో తాచుపామును వదిలిపెట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు నామినేషన్ దాఖలు

రాజోలు: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు రాజోలుకు చెందిన న్యాయవాది నీతిపూడి సత్యనారాయణ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. న్యాయవాది తాడి సంజీవరావుతో పాటు మరో పది మంది పట్టభద్రులు సత్యనారాయణ నామినేషన్‌ను ప్రతిపాదించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించండి

మామిడికుదురు: ఉభయ గోదావరి ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కోరారు. పాశర్లపూడి టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసిందన్నారు. వీటిని పట్టభద్రులకు వివరించాలని సూచించారు.

ఘనంగా కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్ర



అంతర్వేదిలో కొపనాతి కృష్ణమ్మ విగ్రహానికి వేసిన గజమాల



మామిడికుదురు మీదుగా సాగుతున్న గజమాల యాత్ర

మామిడికుదురు: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వ్యవస్థాపకుడు కొపనాతి కృష్ణమ్మ గజమాల యాత్ర శుక్రవారం ఘనంగా జరిగింది. కృష్ణమ్మ స్వస్థలం అల్లవరం మండలం ఓడలరేవు నుంచి యాత్ర వైభవంగా ప్రారంభమైంది. పలు రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనంపై గజమాలను ఊరేగిస్తూ యాత్ర ప్రారంభమైంది. అక్కడి నుంచి వైనతేయ వారధి మీదుగా పాశర్లపూడి, మామిడికుదురు, నగరం గ్రామాల మీదుగా ఈ యాత్ర సాగింది. వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో విచ్చేసిన అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు ఈ యాత్రలో పాల్గొన్నారు. మోటారు సైకిళ్లు, ఇతర వాహనాలపై యాత్రలో పాల్గొని సందడి చేశారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో యాత్ర పొడవునా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కృష్ణమ్మ, సుబ్బరాజు విగ్రహాలకు నివాళులు

పి.గన్నవరం: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ, రాష్ట్ర మత్స్యకార సంఘ నాయకుడు దివంగత పెమ్మాడి సుబ్బరాజు విగ్రహాలకు శుక్రవారం పి.గన్నవరం అక్విడెక్ట్ పార్కులో నియోజకవర్గ అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అంతర్వేది వరకూ జరిగిన గజమాల యాత్రలో మండలం నుంచి అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు శేరు శ్రీనుబాబు, పెమ్మాడి మారుతీ కృష్ణమోహన్, నాయకులు కొల్లు రాంబాబు, అర్థాని ఏడుకొండలు పాల్గొన్నారు.